www.prajasakti.com

ప్రజాశక్తి

ఆదివారం 1 డిసెంబర్ 2024

5



ఇవిఎంల భద్రతకు చర్యలు: కలెక్టర్

ప్రజాశక్తి - అమలాపురం

ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్ల భద్రతకు తగిన చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ తెలిపారు. శనివారం ఆయన ముమ్మిడివరం ఎయిమ్స్ ఇంజనీరింగ్ కళాశాల ప్రాంగణంలో ఇవిఎంల భద్రపరచిన గొడౌను అధికారులతో కలిసి పరిశీలించారు. నెలవారి తనిఖీలో భాగంగా గొడౌన్ సీళ్లను తనిఖీ చేసి రిజిస్టర్‌లో సంతకం చేశారు. ఇవిఎంల భద్రతకు ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సిబ్బందిని ఆదేశించారు. భారత ఎన్నికల సంఘం మార్గ నిర్దేశాల మేరకు నెలకోసారి ఇవిఎంల గోదామును తనిఖీ చేస్తామన్నారు. ప్రతి మూడు నెలలకోసారి గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఇవిఎంల గొడౌన్‌ను తనిఖీ చేసి సమగ్ర నివేదికను ఎన్నికల సంఘానికి పంపిస్తామని కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో ఇన్చార్జి డిఆర్ఒ మదన్‌మోహన్‌రావు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

తుపానుతో రైతుల్లో అలజడి

- అక్కడక్కడా నేలనంటిన వరి
- పంట చేతికొచ్చే వేళ దుస్థితి

ఫెంగల్ తుపానుతో రైతుల్లో అలజడి నెలకొంది. అక్కడక్కడా కురుస్తున్న భారీ వర్షాలు, గాలులకు వరి పంట నేలకొరిగింది. వరి పనలపై ఉన్న రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. తీర ప్రాంతాల్లో సముద్రం అల్లకల్లోలంగా ఉంది.

ప్రజాశక్తి-యంత్రాంగం

రాజోలు డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాలో 1.63 లక్షల ఎకరాల్లో ఖరీఫ్ వరి సాగు చేశారు. జిల్లాలో ఇప్పటి వరకు 94,597 ఎకరాల్లో నూర్పిళ్లు పూర్తయ్యాయి. రైతులు ధాన్యాన్ని ఒబ్బిడి చేసుకున్నారు. 161 ఎకరాల్లో వరి చేలు పనల మీద ఉంది. 370 ఎకరాలకు చెందిన రాశులు కుప్పలపై ఉన్నాయి. సుమారు 60 వేల ఎకరాల్లో వరి చేలు కోతల జరగాల్సి ఉందని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు.

ఈ ఏడాది పొలాలకు నీటి ఎద్దడి సమస్య ఉన్నప్పటికీ రైతులు ప్రత్యామ్నాయ మార్గాలు వెతుక్కుంటూ పంటను కంటికిరెప్పలా కాపాడుకున్నారు. నాట్లు వేసే సమయంలో వచ్చిన వర్షాలకు మొత్తం మునిగిపోయాయి. అధిక రేట్లకు నారును కొనుగోలుచేసి రెండోసారి వేశారు. నాట్లు వేసిన 20 రోజులకే మరోసారి వర్షాలు పడటంతో పూర్తిగా దెబ్బతిన్నాయి. ఒకటికి రెండుసార్లు పంటలు దెబ్బతిని రైతులు అల్లాడిపోయారు. పంటలు పూర్తిగా దెబ్బతిని కనీసం నష్టపరిహారం కూడా అందక ఇప్పటికే అల్లాడిపోతున్న రైతులు ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు భయంతో దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు.

తీర ప్రాంతం మండలాలైన ఐ.పోలవరం, కాట్రేనికోన, ఉప్పలగుప్తం, అల్లవరం, మామిడికుదురు, మలికిపురం, సఖినేటిపల్లిలో గాలుల ప్రభావం ఎక్కువగా ఉంది. అక్కడక్కడా వరి చేలు నేలకొరుగుతున్నాయి. ఆది, సోమ వారాల్లో కనుక వర్షాలు పడితే ఇబ్బంది ఏర్పడుతుందని రైతులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. వరి కోతలు పూర్తి చేసి పనల మీద ఉంచిన వారు, రాశులుగా పోసిన వారు ఎక్కువగా ఆందోళన చెందుతున్నారు. ధాన్యాన్ని వేగంగా ఒబ్బిడి చేసుకునే పనిలో పడ్డారు. జిల్లాకు భారీ వర్షాలు ఉండవని వాతావరణ శాఖ ప్రకటించినప్పటికీ కొద్దిపాటి వర్షం కురిసినా యంత్రాలతో కోతలకు అవాంతరాలు ఏర్పడతాయని రైతులు వాపోతున్నారు. అమలాపురం, రాజోలు, పి.గన్నవరం వ్యవసాయ సబ్ డివిజన్ల పరిధిలో మూడొంతుల ప్రాంతాల్లో మాత్రం దిగుబడి 20 బస్తాలకు మించి వచ్చే అవకాశం లేదని రైతులు వాపోతున్నారు. ఉప్పలగుప్తం, అల్లవరం, సఖినేటిపల్లి, మలికిపురం, కాట్రేనికోన మండలాల పరిధిలో సముద్ర తీరాన్ని ఆనుకుని ఉన్న గ్రామాల్లో వరి బాగా దెబ్బతింది. ఈ ప్రాంతంలో సుమారు 41,150 ఎకరాల్లో వరిసాగు జరుగుతోంది. కనీస పెట్టుబడులు కూడా రావని, వస్తున్న దిగుబడిలో తాలు, తప్పలు అధికంగా వచ్చే అవకాశముందని వారు ఆందోళన చెందుతున్నారు. కొంతమంది రైతులు రెండుసార్లు నారుమడులు వేయాల్సి వచ్చింది. ఇన్ని అవాంతరాలు దాటి ఉన్న కొద్దిపాటి ధాన్యాన్ని పొందుదామనుకుంటున్న రైతులకు తుపాను ప్రభావం కొత్త ఆందోళన రేకెత్తిస్తోంది.



ఉప్పలగుప్తంలో సముద్రపు అలల ఉధృతి



రామచంద్రపురంలో వర్షంతో నిర్మానుష్యంగా మారిని రహదారి



కాట్రేనికోన మండలంలో నేలకొరిగిన వరిచేలు

ఉప్పలగుప్తం తుపాను ప్రభావంతో ఉప్పలగుప్తం సముద్ర తీరంలో అలజడి నెలకొంది. సముద్రపు అలలు ఉవ్వెత్తున ఎగసి పడుతూ సముద్రం అల్లకల్లోలంగా మారింది. శనివారం ఉదయం నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షానికి జనజీవనం స్తంభించింది. తీర గ్రామాలైన ఎస్.యానాం, వాసాలతిప్ప, ఎన్.కొత్తపల్లి, రాఘవులపేటలో మత్స్యకారులు చేపల వేటకు స్వస్తి పలికి ఇంటికే పరిమితం అయ్యారు. అధికారులు ముందస్తు జాగ్రత్తలు తెలపడంతో కొంతమేర వరి పంటను రైతులు ఒబ్బిడి చేసుకోగా చాలావరకు వంట వరి చేలల్లోనే ఉండిపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వ ప్రైవేటు విద్యాసంస్థలు యధావిధిగా పనిచేయడంతో ఎడతెరిపి లేని వర్షానికి విద్యార్థులు ఇబ్బందులు పడ్డారు. మరో రెండు రోజులు వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరికలతో ప్రజల ఆందోళన చెందుతున్నారు. **మామిడికుదురులో** ఈదురు గాలులకు పలుచోట్ల వరి పంట నేల కొరిగాయి. కోత కోసి కుప్ప నూర్చిన ధాన్యం తడవకుండా రైతులు ధాన్యం రాశులపై బరకాలు కప్పారు. **రామచంద్రపురంలో** శుక్రవారం సాయంత్రం నుంచి వర్షాలు కురుస్తున్నాయి. జనసంచారం లేక మెయిన్ రోడ్లన్నీ వెలవెలబోయాయి. **కోటనందూరు** కాకరపల్లి, అల్లిపూడిలో పెను గాలులతో కూడిన వర్షం కురిసింది. విద్యుత్ సరఫరా పూర్తిగా నిలిచిపోయింది. పెనుగాలులకు అల్లిపూడిలో చెట్లు విరిగి పడుకోవడంతో విద్యుత్ సరఫరా పూర్తిగా నిలిచిపోయింది. అల్లిపూడి, కాకరపల్లి కోటనందూరులో వర్షంతో పంట తడిసిపోయింది. **యు.కొత్తపల్లి** తుపాను కారణంగా రెండు రోజుల నుండి ఉప్పాడ తీరం రాకాసి అలలు అలజడి సృష్టిస్తున్నాయి. ఉవ్వెతున్న ఎగసి పడుతున్న అలల కారణంగా ఉప్పాడ పంచాయతీ పరిధిలోని మాయాపట్నం మత్స్యకార గృహాలు కోతకు గురవుతున్నాయి. ఉప్పాడ నుండి నేమాం వరకూ అలల తాకిడికి రక్షణగా వేసిన రాళ్లు రోడ్డుపైకి చేరాయి. **కాట్రేనికోన** మండలంలో ఉదయం నుంచి ఎడతెరిపిలేకుండా వర్షం కురుస్తోంది. సగం వంతు వరిపంట కోతలు కోసి చేలలో పనలపై ఉండగా పావు వంతు భాగం ధాన్యం కల్లాలలో రాశులుగా పడివుంది. పనలు చేలపై ఉండడంతో అవి తడిసిపోయి మొక్క మొలిచే పరిస్థితి ఏర్పడింది. **ఆత్రేయపురంలో** ఈదురు గాలులకు అక్కడక్కడా వరి పంట పొలాలు నేలకొరిగాయి. **ముమ్మిడివరంలో** ధాన్యంపు రాశులు తడిసి ముద్దయ్యాయి.

డిమాండ్‌కు అనుగుణంగా ఇసుక సరఫరా

ప్రజాశక్తి - రావులపాలెం



స్టాక్ పాయింట్ తనిఖీ చేస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్

డిమాండ్ కు అనుగుణంగా ఇసుకను సరఫరా చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ ఇసుక తవ్వకాలు నిర్వహించే గుత్తేదారులను ఆదేశించారు. శనివారం రావులపాలెం మండలం ఊబలంక వద్ద ఆర్ఎస్ ఆర్ ఏజెన్సీ నిర్వహిస్తున్న ఇసుక స్టాక్ పాయింట్‌ను కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఉచిత ఇసుక విధానాన్ని అమలు చేస్తుందని, ఎటువంటి అవకతవకలు లేకుండా నిర్దేశించిన మేరకు ఇసుక తవ్వకాలు జరిగేలా చర్యలు తీసుకుంటామని అన్నారు. ఊబలంక ఇసుక ర్యాంపు నుంచి సుమారు 64,800 మెట్రిక్ టన్నుల ఇసుక తవ్వ కాలకు అనుమతి ఇచ్చామన్నారు. ప్రతిరోజు 500 మెట్రిక్ టన్నుల మేర ఇసుకను తవ్వి వినియోగదారులకు అందుబాటులో ఉంచే విధంగా సంబంధిత ఏజెన్సీలను ఆదేశించా మన్నారు. స్టాక్ పాయింట్ వద్ద రాత్రింబవళ్లు ఇసుక కార్యకలాపాలు జరిగేలా ఏజెన్సీ లు చూడాలన్నారు. ఇసుక ర్యాంపు వద్ద మాత్రం నిర్దేశించిన సమయంలోనే తవ్వకాలు జరగాలన్నారు. ఎట్టి పరిస్థితి లోనూ ఇసుకను అవసరమైన వారందరికీ అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ బియం.ముక్తే శ్వరరావు, మైన్స్ అధి కారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రామారావు ఆశయ సాధనకు కృషి

ప్రజాశక్తి- రాజోలు



వర్ధంతి సభలో మాట్లాడుతున్న ఐద్వా నాయకురాలు రమణి

సిపిఎం సీనియర్ నాయకులు, పార్టీ సభ్యులు, సిఐటియు సీనియర్ నాయకులు కందిగట్ల రామారావు ఆశయ సాధనకు కృషి చేయాలని ఐద్వా రాష్ట్ర సహయ కార్యదర్శి సిహెచ్. రమణి అన్నారు. శనివారం రామా రావు రెండవ వర్ధంతి సభ సోంపల్లిలో కందిగట్ల మదన్ అధ్యక్షతన ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా రమణి మాట్లాడుతూ రాజోలు మండలంలో పార్టీని విస్తరించడంలో రామారావు పాత్ర మరువలేనిదన్నారు. అనేక కష్టాలు వచ్చినప్పటికీ కడదాకా ఎర్ర జెండాని నమ్ముకొని ఉన్నారని అన్నారు. రామారావు స్వగ్రామంలో ఎవరికి ఏ ఆపద వచ్చినప్పటికీ వారికి అండగా ఉంటూ పార్టీ కోసం ప్రజల కోసం పని చేశారని. రాజోలు, మలికిపురం, సఖినేటిపల్లి మండలాలో అనేక విష యాల్లో, వివిధ సందర్భాల్లో సేవలు చేసి, పార్టీలో అంకితభావంతో పనిచేసిన కార్యకర్త రామారావు అని అన్నారు. తొలుత రామారావు చిత్రపటంకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పిం చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు బుంగ సత్య నారాయణ, సిహెచ్.సూర్యప్రకాశరావు, ఐద్వా నాయకురాలు కందిగట్ల గిరిజ, కుటుంబ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి ప్రమీలా రాణి

ప్రజలకు న్యాయపరమైన సహకారం అందించాలి

ప్రజాశక్తి - రాజోలు

గ్రామాల్లో ప్రజలకు చట్ట పరమైన, న్యాయ పరమైన సహాయ, సహకారాలను పారాలీగల్ వాలంటీర్లు అందిచాలని మండల న్యాయసేవాధికార సంస్థ ఛైర్మన్, సీనియర్ సివిల్ జడ్జి పి.ప్రమీలా రాణి అన్నారు. ఇటీవల రాజమహేంద్రవరం జిల్లా కోర్టులో శిక్షణ పొందిన పారా లీగల్ వాలంటీర్లకు శనివారం గుర్తింపు కార్డులు, బ్యాడ్జీలు అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వాలంటీర్లు గ్రామాల్లో ప్రజా సమస్యలను గుర్తించి సంబంధిత అధికారుల దష్టికి తీసుకువెళ్లి వాటిని పరిష్కరిం చేందుకు కృషి చేయాలన్నారు. న్యాయ వ్యవస్థపై ప్రజలకు అవగాహన కల్పించి, న్యాయ సందే హాలు నివృత్తి చేయాలని, చట్టపరమైన, న్యాయ పరమైన కేసులు సత్వర పరిష్కారం చేసుకునే దిశగా వారిని చైతన్య వంతులు చేయాలన్నారు.

డిసెంబర్ 14 న జాతీయ లోక్‌అదాలత్

డిసెంబర్ 14న జరిగే జాతీయ లోక్ అదాలత్‌లో వీలైనంత ఎక్కువ కేసులు పరిష్కారం అయ్యేలా కృషి చేయాలని సీని యర్ సివిల్ జడ్జి ప్రమీలా రాణి బార్ అసోసియేషన్ సభ్యులను కోరారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు జి.స్టాలిన్, జాలెం భాస్కర రావు, ఆచంట శ్రీనివాస్, వైఎస్ఎస్.అయ్యప్ప నాయుడు, జి.రజిత, జి.పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

పంట నష్టం నివారణకు చర్యలు

ప్రజాశక్తి - అమలాపురం

రెవెన్యూ, సివిల్ సప్లై, వ్యవసాయ అధికారులు సమన్వయంతో పనిచేస్తూ రైతులు పండించిన పంటను తుపాను మూలంగా నష్టపోకుండా తగిన చర్యలు చేపట్టారని కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ అధికారులను అభినందించారు. శనివారం తాసిల్దార్లు, సివిల్ సప్లై, వ్యవసాయ అధికారులతో టెలికాన్ఫిరెన్స్ నిర్వహించి రైతుల నుంచి ధాన్యం సేకరణ, క్షేత్రస్థాయిలోని పరిస్థితులు, తీసుకోవలసిన జాగ్రత్తలు తదితర అంశాలపై సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తుపాను కారణంగా భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ జారీ చేసిన ముందస్తు హెచ్చరికలను అధికారులు క్షేత్రస్థాయిలో రైతులకు తెలిపి తగిన జాగ్రత్తలు సూచించారన్నారు. అప్పటికే కోతలు పూర్తయిన పంటలను త్వరితగతిన మిల్లులకు చేరవేయడం జరిగిందని.. వరి కోతలు ప్రారంభం గాని ప్రాంతాలలో నాలుగు రోజులపాటు వాయిదా వేయాలని అధికారులు క్షేత్రస్థాయిలో రైతులకు సూచిం చడం మూలంగా నష్టాన్ని నివారించగలిగామన్నారు. టార్పాలిన్లను అవసరమైన రైతులకు అందించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ధాన్యం సేకరణ విషయంలో క్షేత్రస్థాయిలో రైతులకు ఏమైనా సమస్యలు ఎదురైతే అమలాపురం కలెక్టరేట్లో ఏర్పాటుచేసిన కంట్రోల్ రూమ్ (నెంబర్లు 8309432487,9441692275)కు ఫోన్ చేస్తే సంబంధిత సమస్యను వెంటనే పరిష్కరించే దిశగా చర్యలు చేపడతామన్నారు. జిల్లాలో ఈ ఖరీఫ్ సీజనో ఇప్పటివరకు 1,18,559 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించామన్నారు. కోతలు పూర్తయి 14,417 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మిల్లులకు షిఫ్ట్ చేయాల్సి ఉందన్నారు. ఇప్పటివరకు సేకరించిన ధాన్యానికి రూ.252 కోట్లు రైతుల ఖాతాలో జమ చేశామని కలెక్టర్ తెలిపారు.

రైతులకు అందుబాటులో ఉండాలి

మామిడికుదురు: ఫెంగల్ తుపాను ప్రభావంతో శనివారం ఉదయం నుంచి భారీ వర్షాలు కురుస్తుం డడంతో గ్రామస్థాయి ఉద్యోగులు రైతులకు అందుబా టులో ఉండి సహాయ సహకారాలు అందించాలని తహశీల్దార్ వైవి.సుబ్రహ్మణ్యాచార్యులు అన్నారు. మండల పరిధిలో క్షేత్ర స్థాయిలో సందర్శించి రైతులతో మాట్లాడారు రైతులకు నష్టం వాటిల్లకుండా ధాన్యం తరలింపులో రైస్ మిల్లర్లతో, రైతులతో మాట్లాడి వారికి నచ్చిన విధముగా సచివాలయ ఉద్యోగులు, విఆర్ఒలు, గ్రామ శాఖ వ్యవసాయ సహాయకులు పనిచేయాలన్నారు.

ధాన్యాన్ని మిల్లులకు తరలించాలి

ప్రజాశక్తి - పి.గన్నవరం



రైతులతో మాట్లాడుతున్న పి.గన్నవరం ఎంపిడిఒ కెవి. ప్రసాద్

రైతులు ధాన్యాన్ని మిల్లులకు తరలించి టార్పాలిన్లు కప్పి భద్రపరచు కోవాలని ఎంపిడిఒ కెవి.ప్రసాద్ అన్నారు. ఫెంగల్ తుపాను ప్రభావంతో శనివారం ఉదయం నుంచి భారీ వర్షాలు కురుస్తుండటంతో పి.గన్నవరం ఎంపిడిఒ కెవి.ప్రసాద్ క్షేత్రస్థాయిలో పర్యటించి క్రింది స్థాయి ఉద్యోగులను అప్రమత్తం చేశారు. పోతవరం, తాటికాయలపల్లిలో సందర్శించి రైతులతో మాట్లాడారు. వ్యవసాయ శాఖ అధికారులు, రైతులకు అందుబాటులో ఉండి పంట సంరక్షణకు సహాయ సహకారాలు అందించాలన్నారు. ఆయన వెంట వ్యవ సాయ శాఖ సిబ్బంది ఉన్నారు.

'శ్రీచైతన్య'లో పారిశుధ్య కార్మికులకు సన్మానం

ప్రజాశక్తి - రామచంద్రపురం



కార్మికులు, డ్రైవర్లను సన్మానించిన ప్రిన్సిపల్, విద్యార్థులు

రామచంద్రపురం శ్రీ చైతన్య స్కూల్ లో శనివారం ఇక్కడ పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. స్కూల్లో వారం రోజులుగా నిర్వహిస్తున్న సోషల్ వీక్ లో భాగంగా విద్యార్థులకు వివిధ రకాలైన వృత్తుల పట్ల అవగాహన కల్పించడం కోసం ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ కె.రాము మాట్లాడుతూ విద్యార్థులు దేశ సంస్కృ తి, సంప్రదాయాల పట్ల అవగాహన కలిగి వాటిని గౌరవించేలా చేయడం ,పర్యావరణాన్ని పరిరక్షించేం దుకు విద్యార్థులు నిర్వహించాల్సిన బాధ్యత, తల్లిదం డ్రుల పట్ల, గురువల పట్ల గౌరవం కలిగి ఉండేందుకు సోషల్ వీక్ లో ఏర్పాటు చేసిన కార్యక్రమాలు ఉపయో గపడతాయని వివరించారు. రీజినల్ ఇన్‌ఛార్జి నరేష్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి సొసైటీ పట్ల బాధ్యత కలిగి ఉండి సమాజంలో అందరి నీ గౌరవ భావం తో చూడాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా స్కూల్లో పనిచేస్తున్న ఆయాలు, స్కావెంజర్స్, డ్రయి వర్లు, క్లీనర్లను సన్మానించారు. విద్యార్థులు నిర్వహిం చిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో ప్రయిమరీ ఇంఛార్జి వల్లి, ఉపాధ్యా యులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

నేడు రెడ్డిపల్లిలో ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి - అమలాపురం రూరల్

రెడ్డిపల్లి గ్రామంలో ఆదివారం ఉచిత మల్టీ స్పెషాలిటీస్ వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు గ్రామ సర్పంచ్ కరాటం ప్రసన్న శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఈ వైద్య శిబిరం కొనసాగుతోందన్నారు. స్థానికులతో పాటు చుట్టుప్రక్కల గ్రామాల ప్రజలు కూడా సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ విజ్ఞప్తి చేశారు. ఈ వైద్య శిబిరంలో 23 రకాల వైద్య నిపుణులు పాల్గొంటారన్నారు. బిపి, కంటి పరీక్షలు, తదితర పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేస్తారని డాక్టర్ శ్రీమన్నారాయణరావు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కరాటం సూర్య భాస్కరరావు, కార్యదర్శి ఆదిశంకరం పాల్గొన్నారు.

పుల్లేటికుర్రు హైస్కూల్లో 'బాలల సురక్ష'

ప్రజాశక్తి - పి.గన్నవరం



విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ ఇంద్రావతి

మండలంలోని పుల్లేటికుర్రు హైస్కూల్‌లో బాలల సురక్ష కార్యక్రమం శనివారం నిర్వహించారు. దీనిలో భాగంగా విద్యార్థిని లకు ముక్కామల పిహెచ్‌సి వైద్యాధికారిణి ఎ.ఇంద్రావతి ఆధ్వర్యంలో శనివారం బాలికలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. శారీరక కొలతలతో పాటు రక్తహీనత, మధుమేహం, ఇతర రక్త పరీక్షలు నిర్వహించి ఆరోగ్య సమస్యలపై అవగాహన కల్పించి అవసరమైన మందులు అందజేశారు. డిసెంబర్ 1న ప్రపంచ ఎయిడ్స్ డే సందర్భంగా విద్యార్థులతో ర్యాలీ నిర్వహించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో హైస్కూల్ హెచ్‌ఎం కనకదుర్గ, సిహెచ్ఒ రవికుమార్, విద్యా కమిటీ ఛైర్మన్ నూక రత్నమాల, సభ్యులు పి.నాగలక్ష్మి, సిహెచ్.రాధాబాయ్, ఎన్.బాబులు, ఉపాధ్యాయులు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు ఎంఎల్ఎ పరామర్శ

ప్రజాశక్తి - కాట్రేనికోన



మృతుని చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎంఎల్ఎ దాట్ల

ఇటీవల కాలంలో మరణించిన ఇద్దరు టిడిపి కార్యకర్తల మరణించారు. వారి ఎపి రాష్ట్ర శాసనసభ విప్, ఎంఎల్ఎ దాట్ల సుబ్బరాజు శనివారం పరామర్శించారు. కాట్రేనికోన పంచాయతీ పరిధిలోని గరువు ప్రాంతానికి చెందిన టిడిపి క్రియాశీలక సభ్యుడు నల్లా అర్జున్ రావు మరణించడంతో చెందడంతో అతని కుమారుడు వెంకటేశ్వరరావు, రాజానగరం గ్రామానికి చెందిన ఓలేటి ప్రసాద్ ఇటీవల విద్యుత్ ప్రమాదంలో చనిపోవడంతో అతని కుటుంబ సభ్యులను శనివారం పరామర్శించి ఓదార్చారు. మతి చెందిన వారి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ముమ్మిడివరం మాజీ ఎంఎల్ఎ చెల్లి వివేకానంద, గుత్తుల సాయి, రాష్ట్ర మాల కార్పొరేషన్ డైరెక్టర్ చెల్లి అశోక్, దాట్ల పవన్, మోకా అప్పాజీ, జంగా శ్రీనివాసరావు, బండారు ఏసుబాబు, మోర్త శ్రీనివాస్ వర్మ, గుత్తుల సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

నేడు జాతీయ ఉపకార వేతన మోడల్ పరీక్ష

ప్రజాశక్తి - అమలాపురం

అంబేద్కర్ కోనసీమ జిల్లాలో స్కూల్ అసిస్టెంట్స్ అసోసియేషన్ జిల్లా భౌతిక, గణిత శాస్త్ర ఫోరం సంయుక్త ఆధ్వర్యంలో ఎన్ఎంఎంఎస్ ఉచిత మోడల్ పరీక్ష ఆదివారం, డిసెంబర్ 1న నిర్వహించనున్నారు. ఈ పరీక్ష మూడు డివిజన్లలోని మూడు కేంద్రాలలో ఉదయం 9:30 నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు నిర్వహిస్తారని జిల్లా సైన్స్ అధికారి జివిఎస్.సుబ్రహ్మణ్యం శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

పరీక్ష కేంద్రాల వివరాలు

1.అమలాపురం డివిజన్: జడ్‌పి హై స్కూల్, అమలాపురం సమన్వయకర్త: టివి.సూర్య నారాయణమూర్తి 2.కొత్తపేట డివిజన్: జడ్‌పి బాయ్స్ హైస్కూల్, రావులపాలెం సమన్వయకర్త:ఆదివారపుపేట వెంకటేశ్వరరావు. 3. రామచంద్రపురం డివిజన్: జడ్‌పిఉన్నత పాఠశాల, ద్రాక్షారామ జిల్లా సైన్స్ అధికారి జివిఎస్. సుబ్రహ్మణ్యం, శనివారపు పాపయ్య. ఈ పరీక్షకు దరఖాస్తు చేసిన విద్యార్థులు ఈ ఉచిత మోడల్ పరీక్షకు హాజరు కావాలని సుబ్రహ్మణ్యం కోరారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు వినియోగించుకోవాలన్నారు. విద్యార్థులు తమకు సంబంధించిన డివిజన్ కేంద్రానికి నేరుగా హాజరుకావాలన్నారు. .

సిసి రోడ్డు నిర్మాణం ప్రారంభం

ప్రజాశక్తి - ఆలమూరు



గాంధీనగరంలో సిసి రోడ్డు పనులను పరిశీలిస్తున్న నాయకులు

మండలంలోని చెముడులంక శివారు గాంధీనగరంలో సిసి రోడ్డు నిర్మాణ పనులు శనివారం ప్రారంభమయ్యాయి. గత ప్రభుత్వ హయాంలో ఈ రోడ్డు నిర్మాణం జరగాల్సి ఉండగా తాత్సారం చేశారు. ఈ సమస్యను ఎన్నికల నేపథ్యంలో కొత్తపేట కూటమి ఎంఎల్ఎ బండారు సత్యానందరావు దష్టికి స్థానికులు తీసుకుని వెళ్లగా రోడ్డు నిర్మాణానికి ఆయన హామీ ఇచ్చారు. ఆయన ఇచ్చిన హామీ మేరకు గత అక్టోబర్ 17న ఉపాధి నిధులు రూ.20 లక్షలు మంజూరు చేసి సిసి రోడ్డుకు శంకుస్థాపన చేశారు. దీంతో రోడ్డు పనులు ప్రారంభమయ్యాయి. ఈ మేరకు సిసి రోడ్డు పనులను స్థానిక మాజీ ఎంపిటిసి సభ్యుడు నాగిరెడ్డి వెంకటేశ్వరరావు, మాజీ సర్పంచ్ నాగిరెడ్డి వెంకటరత్నం, మాజీ సొసైటీ డైరెక్టర్ అడబాల వీర్రాజు, కూటమి నేతలు కె.రామకృష్ణ, శిరంగుల సతీష్, గుండుమల్ల రామారావు, లంకలపల్లి ఆంజనేయులు తదితరులు పరిశీలించారు.

యాత్రికులతో కిక్కిరిసిన 'వాడపల్లి' ఆలయం

ప్రజాశక్తి - ఆత్రేయపురం

కార్తీక మాసాన్ని పురస్కరించుకుని శనివారం వాడపల్లి శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయం యాత్రికులతో కిక్కిరిసింది. వేకువ జామున స్వామివారికి సుప్రభాత సేవ అనంతరం యాత్రికులకు దర్శనాలకు అనుమతిచ్చారు. తెలుగు రాష్ట్రాలు ఉండే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి అధిక సంఖ్యలో యాత్రికులు రావడంతో రాత్రి 9 గంటల వరకు యాత్రికుల రద్దీ కొనసాగింది. లక్షకు పైబడే యాత్రి కులు స్వామి దర్శించుకున్నారు. ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ డిసి నల్లం చక్రధరరావు ఏర్పాట్లను పూర్తి చేసి పర్యవేక్షించారు. స్వామివారిని దర్శించుకున్న భక్తులకు భారీ స్థాయిలో ప్రసాద వితరణ, అన్నదానం నిర్వహించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్ఐ ఎస్. రాము తన సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేశారు. ప్రముఖ సినీ నటులు కృష్ణంరాజు సతీమణి శ్యామలాదేవి స్వామివారిని దర్శించుకున్నారు.




మాట్లాడుతున్న మెప్మా, బ్యాంక్ అధికారులు

వీధి వ్యాపారులకు అవగాహన

ప్రజాశక్తి - అమలాపురం

వీధి వ్యాపారులకు డిజిటల్ యాక్టివేషన్, పిఎం స్వనిధి లోన్స్, కేంద్ర ప్రభుత్వ పథకాల తదితర అంశాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమాలను గత నెల 16 నుంచి ఈ నెల 2వ తేదీ వరకూ నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో శనివారం అమలాపురం యూనియన్ బ్యాంక్ మెయిన్ బ్రాంచ్ నందు స్వనిధి బీ-స్వభియాన్ బీ పక్వాడ అనే కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి మునిసిపల్ కమిషన్ రాజు, యూనియన్ బ్యాంక్ మేనేజర్ శేషు ప్రవీణ్, మెప్మా అధికారి శ్రీనివాస్, మెప్మా కమ్యూనిటీ ఆర్గనైజర్స్, మెప్మా ఆర్‌పిలు, డిజిటల్ అగ్రికేటర్లు, మెప్మా సిబ్బంది, ఆర్‌పిలు పాల్గొన్నారు.

కార్టూ'నిజం'



నేరాలు ఘోరాలు

లక్ష్మీ శ్రీనివాస బ్యాంకర్స్ యజమానిపై దాడి

ప్రజాశక్తి - రౌతులపూడి

స్థానిక లక్ష్మీ శ్రీనివాస బ్యాంకర్స్ యజమాని రోతు నారాయణమూర్తిపై గుర్తుతెలియని ఇద్దరు వ్యక్తులు శనివారం దాడి చేసి పరారయ్యారు. దాడి సమాచారాన్ని తెలుసుకున్న ఎస్‌ఐ వెంకటేశ్వరరావు, సిబ్బందితో సంఘటన ప్రాంతానికి చేరుకుని వివరాలను సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ రెండు రోజుల క్రితం తాకట్టు పెట్టిన బంగారాన్ని విడిపించుకునేందుకు ఇద్దరు వ్యక్తులు వచ్చారని, అయితే తాకట్టు పెట్టిన సమయంలో ఇచ్చిన రసీదును తీసుకురావాలని బ్యాంకర్స్ యజమాని నారాయణమూర్తి చెప్పారని అన్నారు. ఈ కారణంగా ఈ దాడి జరిగినట్లు భావిస్తున్నామని అన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేయనున్నట్లు చెప్పారు.

టిప్పర్ ఢీకొని మహిళ మృతి

ప్రజాశక్తి - గండేపల్లి

మండలంలోని తాళ్లూరు శివారున శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...ఎల్లమిల్లి గ్రామానికి చెందిన కర్ణం నాగ రత్నం(58) ద్విచక్రవాహనంపై తాళ్లూరులో దేవాలయానికి వచ్చారు. తిరిగి వెళ్లే క్రమంలో తాళ్లూరు శివారున ఎదురుగా లారీ వేగంగా వచ్చి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ద్విచక్రవాహనంపై ఉన్న ఇద్దరు రోడ్డుపై పడిపోయారు. వెనకవైపు కూర్చున్న నాగరత్నం పై నుంచి లారీ వెళ్లింది. దీంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందారు. నాగరత్నం కుమారుడు దుర్గారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ యు.శివనాగు తెలిపారు.

చెరువులో పడి వ్యక్తి మరణం

ప్రజాశక్తి - గొల్లప్రోలు

మండలంలోని చేబ్రోలులో ప్రమాదశాత్తు ఒకవ్యక్తి చెరువులో పడి మృతి చెందాడు. స్థానికులు వివరాలు తెలిపిన ప్రకారం..ఉలవల వీరబాబు (55) ఉదయం చెరువు వద్దకు బయటికి వచ్చి జారిపడి పోయాడు. ఆ సమయంలో ఎవరూ చూడక పోవడంతో నీటిలో మునిగి మృతి చెందాడు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

ప్రజాశక్తి - తాళ్లరేవు

మండలం పటవల శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి చెందాడు. కోరంగి ఎస్‌ఐ పి.సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. మారేడుమిల్లి మండలం వెలమల కోటకు చెందిన తుంబుడు సుబ్బారెడ్డి(24) కాకినాడలో ఒక హోటల్‌లో పనిచేస్తున్నాడు. శుక్రవారం రాత్రి యానంలోని తన స్నేహితుని పుట్టినరోజు వేడుకలో పాల్గొన్నాడు. శనివారం తెల్లవారుజామున తిరిగి కాకినాడకు ద్విచక్ర వాహనంపై బయలుదేరాడు. పటవల పైడా కళాశాల ప్రాంతంలో తన వాహనం అదుపు తప్పి రోడ్‌పై పడటంతో తలకు బలమైన గాయం అయింది. దీంతో అక్కడికక్కడే ఆ వ్యక్తి మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఆటో ఢీకొని మహిళ మృతి

ప్రజాశక్తి - గోపాలపురం

మండలంలో జగన్నాథపురం వద్ద రోడ్డు ప్రమాదంలో ఒక మహిళ మృతి చెందగా మరో వ్యక్తికి తీవ్ర గాయాలైన సంఘటన శనివారం తెల్లవారు జామున చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వరాల ప్రకారం ఏలూరు జిల్లా, జంగారెడ్డిగూడెం మండలం రెడ్డి గణపవరానికి చెందిన వామిశెట్టి వెంకటేశ్వరరావు, షేక్ బేగం (38) బైకుపై వాడపల్లి వెంకన్న ఆలయానికి వెళుతున్నారు. మండలంలోని జగన్నాథపురం వద్ద ఎదురుగా వస్తున్న ఆటో ఢీకొనడంతో ఇద్దరూ బైక్ సహా కింద పడిపోయి గాయపడ్డారు. స్థానికులు ఇద్దరినీ 108లో గోపాలపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం రాజమండ్రి 108 అంబులెన్స్‌లో తరలిస్తుండగా మార్గం మధ్యలో బేగం మృతి చెందారు. ఎస్‌ఐ కె.సతీష్ కుమార్ కేసు దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

కోడిపందేలపై పోలీసుల దాడి

ప్రజాశక్తి - గోపాలపురం

చెరుకుమిల్లి గ్రామ పరిధిలో కోడిపందేలు నిర్వహిస్తున్నారనే సమాచారంతో దాడులు నిర్వహించినట్లు ఎస్‌ఐ కె.సతీష్ కుమార్ తెలిపారు. ఈ దాడులలో నలుగురిని అరెస్ట్ చేసి వారి నుంచి రూ.2600 నగదు, రెండు కోళ్ల సీజ్ చేసినట్టు తెలిపారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో 30 మందికి జరిమానా

ప్రజాశక్తి - యు. కొత్తపల్లి

గత కొద్ది రోజుల నుంచి డ్రంక్ అండ్ డ్రైవ్‌లో 30 మందిపై కేసులు నమోదు చేసినటు ఎస్‌ఐ జి.వెంకటేష్ శనివారం తెలిపారు. డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన 30 మందిని పిఠాపురం కోర్టులో హాజరు పరచగా ఒక్కొక్కరికి రూ.10 వేలు చొప4న జరిమానాను న్యాయమూర్తి విధించారని తెలిపారు.

17 మద్యం సీసాలతో వ్యక్తి అరెస్ట్

ప్రజాశక్తి - తాళ్లరేవు

ఎక్సైజ్ అధికారులు శనివారం జరిపిన దాడుల్లో కరప మండలం కరప గ్రామానికి చెందిన పుణ్యమంతుల అప్పలరాజు అనే వ్యక్తి నుంచి 17 అక్రమ మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని, వ్యక్తిని అరెస్టు చేసినట్లు తెలిపారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ సిఐ. కె.కోటేశ్వర్, ఎస్‌ఐ నాగేంద్రకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

గోశాలకు గడ్డి విరాళం

ప్రజాశక్తి - ఆలమూరు

మండలంలోని చింతలూరుకు చెందిన గోపరంధామం గోశాలలకు గుమ్మిలేరు సర్పంచ్ గుణ్ణం రాంబాబు శనివారం ఎండు గడ్డి విరాళం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల మేత కొరతతో పశువులు అల్లాడుతున్నాయని వచ్చే వార్తలపై స్పందించినట్లు తెలిపారు. ఈ మేరకు సర్పంచ్ రాంబాబు తన సొంత నిధులు సుమారు రూ.10 వేల వ్యయంతో ఒక ట్రాక్టర్ గడ్డిని కొనుగోలు చేసి మోపులుగా తయారు చేసి నిర్వాహకులకు అందజేశారు. దీంతో దాత రాంబాబును గోశాల ప్రతినిధులు అల్లంరాజు భరణి, నామాల రామకృష్ణ, వెల్ల సత్యనారాయణ తదితరులు అభినందించారు.

తుపానుతో కలవరం

ప్రజాశక్తి - తూర్పు గోదావరి డెస్క్

నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర వాయుగుండం తుపానుగా మారడంతో రైతులను ఆందోళనకు గురిచేసింది. ఖరీఫ్ పంట చేతికందే సమయంలో ఫెంగల్ తుపాన్ రైతుల్లో అలజడిని సృష్టించింది. వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం అన్ని జిల్లాల యంత్రాంగాన్ని అప్రమత్తం చేసింది. కాకినాడ, డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ, తూర్పుగోదావరి జిల్లాల అధికార యంత్రాంగం రైతులను అప్రమత్తం చేస్తూ కార్యాచరణతో అడుగులు వేసింది. వరి పంట కోతలను వాయిదా వేసుకోవాలని, కళ్లాల్లో ఉన్న పంటను సురక్షిత ప్రాంతాలకు తరలించేలా రైతుల్లో అవగాహన కార్యక్రమాలను నిర్వహించింది. శనివారం రాత్రి సమయంలో పుదుచ్చేరి సమీపంలో ఫెంగల్ తుపాన్ తీరం దాటింది. రానున్న ఒకటి, రెండు రోజుల ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లావ్యాప్తంగా ఒక మాదిరి వర్షాలు పడే అవకాశాలు ఉన్నాయనే వాతావరణ శాఖ హెచ్చరికలతో రైతులు అప్రమత్తం అయ్యారు.

ఎరుపెక్కిన కలెక్టరేట్లు

కేంద్రంలోని మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, రైతు వ్యతిరేక విధానాలకు వ్యతిరేకిస్తూ కేంద్ర కార్మిక, రైతు సంఘాలు ఇచ్చిన దేశవ్యాప్త పిలుపులో భాగంగా మంగళవారం జరిగిన ధర్నాలతో కలెక్టరేట్ కార్యాలయాలు ఎరుపెక్కాయి. కేంద్ర కార్మిక సంఘాలైన సిఐటియు, ఎఐటియుసి, ఐఎఫ్‌టియు, ఐఎన్‌టియుసి, ఇతర కార్మిక సంఘాల అనుబంధ కార్మికులు, ఎపి రైతు సంఘం, కౌలు రైతుల సంఘం, ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం వంటి రైతు సంఘాల ప్రతినిధులు పెద్దఎత్తున కలెక్టరేట్లకు తరలివచ్చి తమ నిరసనను వ్యక్తం చేశారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, రైతు వ్యతిరేక విధానాలపై గళమెత్తారు.

పోర్టులో బియ్యం అక్రమ రవాణా

కాకినాడ పోర్టు కేంద్రంగా జరుగుతున్న పిడిఎస్ బియ్యం అక్రమ రవాణా వ్యవహారం కలకలం సృష్టించింది. పౌరసరఫరాల శాఖామంత్రి మనోహర్ గతంలో సైతం తనిఖీలు నిర్వహించారు. సుమారు 13 మిల్లులు, గోదాముల్లో సుమారు 49,545.34 టన్నుల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. అందులో 25,386.72 టన్నులు పిడిఎస్ బియ్యంగా గుర్తించారు. ఈ నెల 26, 27 తేదీల్లో పౌర సరఫరాల సంస్థ ఛైర్మన్ తోట సుధీర్ కాకినాడ జిల్లాలో పలు ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించి పిడిఎస్ బియ్యం నిల్వలను గుర్తించారు. అనంతరం కాకినాడ పోర్టు నుంచి పశ్చిమ ఆఫ్రికాకు పిడిఎస్ బియ్యంతో బయలుదేరిన స్టెల్లా ఎల్ నౌకలో కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ తనిఖీలు నిర్వహించి పిడిఎస్ బియ్యాన్ని గుర్తించారు. అందులో 640 టన్నుల పిడిఎస్ బియ్యం ఉన్నట్లు కలెక్టర్ నిర్ధారించారు. దీంతో రాష్ట్ర డిప్యూటీ సీఎం కె.పవన్ కళ్యాణ్ హుటాహుటిన కాకినాడ పోర్టుకు చేరుకోవడంతో మరోసారి పిడిఎస్ బియ్యం అక్రమ రవాణా వ్యవహారం వేడెక్కింది. పిడిఎస్ బియ్యం అక్రమ రవాణాపై కాకినాడ డిఎస్ఒను రాష్ట్ర ప్రభుత్వం హెడ్ క్వార్టర్‌కు సరెండర్ చేసింది. పిడిఎస్ బియ్యం అక్రమ రవాణాపై సిఐడి, సిబిఐ విచారణ చేయాలనే దానిపై ఈ నెల 4న జరిగే రాష్ట్ర కేబినేట్‌లో చర్చిస్తామని డిప్యూటీ సీఎం ప్రకటించడం చర్చానీయాంశం అయింది.



టీచర్స్ ఎంఎల్‌సి ఎన్నికల ప్రచారం

తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ నియోజకవర్గ ఎంఎల్‌సి ఎన్నికల ప్రచారం ఊపందుకుంది. టీచర్స్ ఎంఎల్‌సి అభ్యర్థులుగా ఐదుగురు పోటీలో ఉన్నారు. ఇందులో పిడిఎఫ్ అభ్యర్థిగా బొర్రా గోపిమూర్తి పోటీ చేస్తున్నారు. ఉభయ ఉమ్మడి గోదావరి జిల్లాల్లో ఆయన విస్తృతంగా ఎన్నికల ప్రచారాన్ని నిర్వహిస్తున్నారు. ఈ నెల 3వ తేదీతో ఎన్నికల ప్రచారం ముగయనుంది. డిసెంబర్ 5వ తేదీన పోలింగ్ ప్రక్రియ జరగనుంది. అధికార యంత్రాంగం పోలింగ్‌కు సంబంధించిన ఏర్పాట్లలో నిమగ్నమయ్యింది.

లబ్ధిదారులకు పింఛన్ల పంపిణీ

ప్రజాశక్తి - యంత్రాంగం

జిల్లాలో మండలాల్లో శనివారం లబ్ధిదారులకు డిసెంబర్ నెల పింఛను అధికారులు పంపిణీ చేశారు.

కొత్తపేట: డిసెంబర్ 1వ తేదీ ఆదివారం రావడంతో ముందుగానే ఈ నెల 1న చెల్లించవలసిన పింఛన్లను శనివారం ప్రజా ప్రతినిధులు, అధికారులు తెల్లవారుజామునే చెల్లించారు. మండలంలో ఇవ్వబడిన మొత్తం పింఛన్లు 10,382. వారిలో 66 మంది నవంబర్‌లో అందుబాటు లేరు. దీంతో వారందరికీ ప్రస్తుతం డిసెంబర్ పింఛన్‌తో పాటూ నవంబర్- నెల బకాయిలు కూడా చెల్లించారు. మండలం కొత్తపేట గ్రామం ఏనుగు మహల్ నందు రెండునెలల పింఛన్‌ను లబ్ధిదారు సూరంపూడి నాగేశ్వరరావుకు ఎంపిడిఒ నరేష్ కుమార్ మరియు వెల్ఫేర్ అసిస్టెంట్ లలిత. అందజేశారు. గత నెల బకాయి పింఛన్ల వివరాలు.. అభయహస్తం-4, వృద్ధాప్య-33, వికలాంగులు -8, చేనేత-1, వితంతు-20. మొత్తం 66 పింఛన్లు. సంబంధిత సొమ్ము రూ.2,26,000 చెల్లించామని ఎంపిడిఒ తెలిపారు. **రావులపాలెం:** మండలం లో 11,832 పింఛన్లు కు గాను 11,612 పింఛన్లు లు పంపిణీ చేశామని ఎంపిడిఒ ఇ.మహేశ్వరరావు తెలిపారు. శనివారం దేవరపల్లి, వెదిరేశ్వరంలో పింఛన్లు ఎంపిడిఒ పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ దీనితో పాటు గత నెలలో పింఛన్ తీసుకొనని వారికి గత నెల ఏరియర్స్ తో పాటు ఈ నెల పింఛన్ కలిపి 63 పింఛన్ లు పంపిణీ చేశామన్నారు.


పింఛన్ అందిస్తున్న కొత్తపేట ఎంపిడిఒ

లంచాల వసూళ్ల ఆరోపణలపై విచారణ

ప్రజాశక్తి - ముమ్మిడివరం

క్యాడర్‌ను బట్టి లంచం అంటూ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో కింది స్థాయి సిబ్బంది కొంత మంది జిల్లా అధికారి పేరు చెప్పి లంచాలు వసూళు చేసినట్లు గుర్తించామని అంబేద్కర్ కోనసీమ జిల్లా వైద్య అధికారి కె.దుర్గారావు దొర తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ అధికారుల ఆదేశాల మేరకు లంచాలకు పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న వారిపై ప్రాథమిక విచారణను చేపట్టామన్నాని తెలిపారు. ముఖ్యంగా కార్యాలయానికి మెడికల్ లీవ్స్, మెటర్నిటీ లీవులు, సరండర్ లీవ్స్ మరియు మెడికల్ రీయింబర్స్‌మెంట్‌ల కోసం వచ్చే వారి నుండి ముగ్గురు సీట్ క్లర్క్స్, ఇద్దరు బిల్లులు చేసే గుమస్తాలు మరియు ఒక జూనియర్ అసిస్టెంట్ లను గుర్తించి, ఎవరి నుండి లంచాలు వసూళ్లు చేశారో వారి నుండి వివరాలను సేకరిస్తున్నామన్నారు. విచారణ పూర్తి చేసి నివేదికను డైరెక్టర్ ఆఫ్ హెల్త్ మరియు రీజినల్ డైరెక్టర్లకు తుది నివేదికను సమర్పిస్తామని జిల్లా వైద్య అధికారి తెలిపారు. ముఖ్యంగా జిల్లాలోని రామేశ్వరం, తాటిపాక, మోరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యుల నుంచి లంచాలు వసూళ్లకు సిబ్బంది పాల్పడినట్లు సామాజిక మాధ్యమంలో పోస్టు రావడంతో ఈ విషయం ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లింది.

గిరిజనులకు దుస్తుల పంపిణీ

ప్రజాశక్తి - ఆలమూరు

స్థానిక శ్రీసిద్ధార్థ హైస్కూల్ విద్యార్థుల ఆధ్వర్యంలో అల్లూరు సీతారామరాజు జిల్లా మారేడుమిల్లి ఏజెన్సీ ప్రాంతంలో గిరిపుత్రులకు ఉచితంగా దుస్తులు పంపిణీ చేశారు. ఆ స్కూల్ డైరెక్టర్ కె.ముల్లారావు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న హెల్పింగ్ హాండ్స్ ఫౌండేషన్ ద్వారా విద్యార్థుల నుంచి దుస్తులను సేకరించారు. ఈ మేరకు సేకరించిన దుస్తులను శనివారం మారేడుమిల్లి ప్రాంతంలోని గిరిజన తండాలకు విద్యార్థులతో కలసి తీసుకువెళ్లి అక్కడ వారికి దుస్తులను అందజేశామని సిద్ధార్థ స్కూల్ యాజమాన్యం తెలిపారు. కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

గల్లా రాము మృతి తీరని లోటు

ప్రజాశక్తి - అమలాపురం

టిడిపి కార్మిక విభాగంలో రాష్ట్ర స్థాయిలో పనిచేసిన గల్లా రాము మృతి పార్టీకి తీరని లోటని మాజీ హోం మంత్రి, పెద్దాపురం ఎంఎల్‌ఎ నిమ్మకాయల చినరాజప్ప పేర్కొన్నారు. అమలాపురంలో శనివారం ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి గల్లా రాము చిత్రపటానికి పూలమాలు వేసి ఘన నివాళులర్పించారు. జిల్లా కార్మిక నేత గల్లా రాము మృతికి జిల్లా దుర్గా మల్లేశ్వర స్వామి కార్పెంటర్ చేతివృత్తుల సంక్షేమ సేవా సంఘం కార్యాలయంలో శనివారం అధ్యక్షులు దేవాదుల సూర్యనారాయణ మూర్తి, సంఘ సభ్యులు సంతాపం తెలిపారు. ఆయన కుటుంబానికి సంతాపాన్ని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సంఘ ప్రధాన కార్యదర్శి గున్నేపల్లి భీమశంకరం, రచయిత నల్లా నరసింహమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ హామీని నెరవేర్చాలని డిమాండ్

ప్రజాశక్తి - అల్లవరం

ఎన్నికల్లో ఇచ్చిన విద్యుత్ చార్జీలు పెంచబోమనే హామీని కూటమి ప్రభుత్వం తక్షణమే నెరవేర్చాలని ఎంఎల్‌సి బొమ్మి ఇజ్రాయిల్ శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ప్రజలపై విద్యుత్ భారం పడకుండా చూడాలని ఆయన అన్నారు. ఎనికలకు ముందు విద్యుత్ ఛార్జీలు పెంచనని ప్రజలకు వాగ్దానం చేసి అధికారంలోకి వచ్చాక ఆ హామీని తుంగలోకి తొక్కిన సిఎం చంద్రబాబు ప్రజలను మోసం చేశారని ఇజ్రాయిల్ విమర్శించారు. గడచిన ఆరు నెలల్లో వరుసగా రెండు సార్లు ట్రూ అప్ ఛార్జీల పేరిట రెండోసారి రూ.9412 కోట్ల కరెంటు ఛార్జీలు పెంచి ఈ ఆరు నెలల్లో రూ.15,485.36 కోట్ల భారం ప్రజలపై మోపరన్నారు.

షరీఫ్‌కు ముస్లిముల శుభాకాంక్షలు

ప్రజాశక్తి - మండపేట

కూటమి ప్రభుత్వంలో మైనారిటీల సంక్షేమం కోసం సలహాదారుగా నియమితులైన ఎం.ఎ. అహ్మద్ షరీఫ్ నూతన బాధ్యతలు స్వీకరించిన నేపథ్యంలో మండపేట నుంచి ముస్లిం మైనారిటీ నాయకులు ఆయనకు శుభాకాంక్షలు అందజేశారు. అమరావతిలో శనివారం బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా మండపేట నుంచి ముస్లిం నాయకులు స్థానిక అబ్దుల్ కలామ్ ఆజాద్ ట్రస్ట్ ఛైర్మన్ షేక్ మౌలానా ఆధ్వర్యంలో తరలి వెళ్లారు. ఈ సందర్భంగా షరీఫ్ ను కలిసి సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. రాష్ట్ర టిడిపి మైనారిటీ సెల్ కార్యదర్శి సల్మాన్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి 'నవోదయ' శిక్షణ

ప్రజాశక్తి - ఆత్రేయపురం

ర్యాలి గ్రామం మ్యాజిక్ హౌస్ నందు ఆదివారం ఉదయం 8 గంటల నుంచి మండలంలోని 17 గ్రామాల్లో వివిధ పాఠశాలలో చదువుతు నవోదయ ఎంట్రన్స్ పరీక్షలు రాస్తున్న విద్యార్థులకు ఉచిత శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు అనూస్ స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.ఎంట్రన్స్ కొరకు దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు తమ పేర్లను నమోదు చేసుకుని ఆదివారం ఉదయం 8 గంటలకు ర్యాలి మ్యాజిక్ హౌస్ లో క్లాసు లకు హాజరు కావాలని నిర్వాహకుడు చింతశ్యామ్ తెలిపారు.వివరాలకు నెం.9866372645 సంప్రదించాలన్నారు.

ఎంఎల్ఎ వేగుళ్లకు ఘన సత్కారం

ప్రజాశక్తి - మండపేట

మండపేట ఎంఎల్‌ఎ వేగుళ్ల జోగేశ్వరరావు రాష్ట్ర అంచనాల కమిటీ ఛైర్మన్‌గా ఇటీవల నియమితులయ్యారు. ఈ సందర్భంగా నియోజకవర్గ దళిత నాయకులు శనివారం పట్టణ టిడిపి కార్యాలయంలో ఆయనను కలసి అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో జిల్లా జెఎస్‌పి ప్రధాన కార్యదర్శి సరాకుల అబ్బులు, కపిలేశ్వరపురం సర్పంచ్ సాకా శ్రీను, వాకతిప్ప ఎంపిటిసి సభ్యుడు కుంచే ప్రసన్న కుమార్, ఎస్‌సి సెల్ నాయకులు ఈలేటి పెద్ద, జక్కుల నరేంద్రకుమార్, తదితరులు పాల్గొన్నారు. **కపిలేశ్వరపురం:** రాష్ట్ర అంచనాల కమిటీ ఛైర్మన్ గా నిమితులైన ఎంఎల్‌ఎ వేగుళ్ల జోగేశ్వరరావుర కపిలేశ్వరపురంలోని మండలంలోని పలు గ్రామాల కు చెందిన పార్టీల నాయకులు ఆయనను కలసి అభినందనలు తెలిపారు .

జిల్లాలో ధాన్యం సేకరణ వేగవంతం

ప్రజాశక్తి - అమలాపురం

జిల్లాలో ధాన్యం సేకరణ వేగవంతంగా జరుగుతోందని జెసి టి.నిషాంతి తెలిపారు. ఈ మేరకు శనివారం ఆమె చాంబర్ నందు జిల్లా పౌర సరఫరాధికారి, జిల్లా పౌరసరఫరాల మేనేజర్, జిల్లా వ్యవసాయ అధికారి, జిల్లా సహకార మార్కెటింగ్ తూనికలు కొలతలు శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జెసి మాట్లా డుతూ ధాన్యాన్ని సేకరణ మరింత పటిష్టంగా జరగడానికి, మరియు కృష్ణాజిల్లా నుంచి కూడా ధాన్యం సేకరిం చటానికి ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాలను అమలుపరచడానికి చర్యలు చేపట్టామన్నారు.

అగ్నిప్రమాద బాధితులకు పరామర్శ

ప్రజాశక్తి - అయినవిల్లి

చింతనలంక గ్రామం జాంబవపేటలో ఇటీవల జరిగిన అగ్నిప్రమాదంలో నిరాశ్రయులైన బాధిత కుటుంబాలను శనివారం జెడ్‌పి ఛైర్మన్ విప్పర్తి వేణు గోపాలరావు పరామర్శించారు. అనంతరం వారికి నిత్యవసరా సరుకులు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ బాధిత కుటుంబాలను ప్రభుత్వం సహాయ సహకారాలు అందించి అన్ని విధాలా ఆదుకోని బాధితులకు అండగా నిలవాలని కోరారు. ఆయన వెంట మాజీ ఎంఎల్‌ఎ పాముల రాజేశ్వరి, స్థానిక జడ్‌పిటి గన్నవరపు శ్రీనివాసరావు, వైసిపి మండల పార్టీ అధ్యక్షులు కుడిపూడి విద్యాసాగర్ తదితరులు ఉన్నారు.

నగర పంచాయతీ కౌన్సిల్ సమావేశం

ప్రజాశక్తి - ముమ్మిడివరం

నగర పంచాయతీ కౌన్సిల్ హాలు నందు శనివారం చైర్మన్ కమిడి ప్రవీణ్ కుమార్ అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం జరిగింది. తొలుత 15 అంశాలు మరియు 2 అంశాలతో కూడిన టేబుల్ అజెండాను ప్రవేశపెట్టి చర్చించారు. ఈ సందర్భంగా 17వ వార్డు కౌన్సిలర్ కౌన్సిలర్ బొంతు సత్య శ్రీనివాస్ సత్య శ్రీనివాస్ పలు సమస్యలపై మాట్లాడారు. నగర పంచాయతీలో కుక్కలు బెడద ఎక్కువగా ఉందని ప్రభుత్వ ఆసుపత్రిలోనూ, గురుకుల పాఠశాలలోనూ కుక్కలు ఎక్కువగా సంచరించడంతో అక్కడ వారు ఇబ్బంది పడుతున్నారని కుక్కలు నిర్మూలనకు చర్యలు చేపట్టాలని చైర్మన్ ప్రవీణ్ కుమార్ ఆదేశించారు.దీనికి కమిషనర్ రవి వర్మ సమాధానమిస్తూ కుక్కల్ని నియంత్రించేందుకు చర్యపడుతున్నామని తెలిపారు. ఈ సమావేశంలో కౌన్సిలర్లు మేనేజర్ నూకరాజు వివిధ శాఖల శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

15 లోగా పిఎం ఆవాస్ యోజనకు దరఖాస్తు చేసుకోవాలి

ప్రజాశక్తి - రామచంద్రపురం

కేంద్ర ప్రభుత్వం ఇళ్లు లేని నిరుపేదల కోసం ఏర్పాటుచేసిన ప్రధానమంత్రి ఆవాస్ యోజన 2.0 పథకానికి డిసెంబర్ 15లోగా దరఖాస్తు చేసుకోవాలని రాష్ట్ర మంత్రి సుభాష్ ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. లబ్ధిదారులు పూరి పాక, పెంకుటిల్లు, లేదా అద్దె ఇంట్లో ఉంటూ సొంత స్థలం కలిగి ఉన్నవారు దీనికి అర్హులన్నారు, ఇంటి పునాదులు, బేస్మెంట్లు మొదలుపెట్టి పూర్తి చేసిన వారు ఈ పథకానికి దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. రేషన్ కార్డ్, ఆధార్ కార్డు జిరాక్స్‌లు, బ్యాంక్ అకౌంట్, ఆదాయ కుల ధ్రువీకరణ పత్రాలు, పొజిషన్ సర్టిఫికెట్ తీసుకుని గహ నిర్మాణ శాఖ కార్యాలయంలో లేదా సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్‌తో ఆన్లైన్‌లో లబ్ధిదారులు డిసెంబర్ 15 తేదీలోగా నమోదు చేసుకోవాలని మంత్రి తెలియజేశారు.

లక్ష్మీనరసింహ స్వామిని దర్శించుకున్న హైకోర్టు జడ్జి

ప్రజాశక్తి - సఖినేటిపల్లి

అంతర్వేది శ్రీలక్ష్మీ నరసింహస్వామిని ఎపి రాష్ట్ర హైకోర్టు జడ్జి వి.గోపాలకృష్ణారావు కుటుంబసమేతంగా శనివారం దర్శించుకున్నారు. జడ్జి వి.గోపాలకృష్ణారావు కుటుంబ సభ్యులు స్వామి వారికి పూజలు చేశారు. దర్శనం అనంతరం అర్చకులు వారికి స్వామి వారి వేద ఆశీర్వచనం అందజేశారు. జడ్జి కృష్ణారావుకు ఆలయ ఇఒ సత్యనారాయణ స్వామి వారి చిత్రపటం అందజేశారు.

తుపానుపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి - సఖినేటిపల్లి

ఫెంగల్ తుపాను వల్ల కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో తీర ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆర్‌డిఒ మాధవి సూచించారు. ఆమె శనివారం సఖినేటిపల్లి మండల పరిషత్ కార్యాలయంలో తుపాను నేపథ్యంలో చేపట్టాల్సిన చర్యలపై మండల స్థాయి అధికారులుతో సమావేశం నిర్వహించారు. మత్స్యకారులు వేటకు వెళ్ళరాదని సూచించారు. రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు. అధికారులు ప్రజలకు అందుబాటులోఉండాలన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహనా ర్యాలీ

ప్రజాశక్తి - రావులపాలెం

ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం పురస్కరించుకొని కొత్తపేట ఏరియా ఆసుపత్రి వారి ఆధ్వర్యంలో అవగాహనా ర్యాలీ, మానవహారం నిర్వహించారు. శనివారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి కొత్తపేట ఐసిటిసి కౌన్సిలర్ ఎండి ప్రసాద్, ఎన్ఎస్ఎస్ అధికారి ఎస్.అరుణ్ కుమార్, జువాలజీ, రెడ్ రిబ్బన్‌క్లబ్ కన్వీనర్ కె.సౌజన్య ఆధ్వర్యంలో డాక్టర్ వి.శ్రీనివాసరావు అధ్యక్షతన హెచ్ఐవి ఎయిడ్స్‌పై ప్రత్యేక అవగాహనా సదస్సు ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఐ సి టి సి కౌన్సిలర్ డి ఎం ప్రసాద్,. ప్రిన్సిపల్ డాక్టర్ వి.శ్రీనివాసరావు విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. అనంతరం విద్యార్థులచే మానవహారం, ప్రతిజ్ఞ, ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులకు హెచ్ఐవి ఎయిడ్స్ కు సంబంధించి డిబేట్, రంగోలి, పోస్టర్ పెయింటింగ్, రీల్ మేకింగ్ వంటి పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు బిపిన్.రెడ్డి, సత్యమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఫసల్ బీమాతో రైతులకు భరోసా

ప్రజాశక్తి - అమలాపురం

వైపరీత్యాలతో పంట దిగుబడి నష్టపోయిన రైతుకు భరోసా కల్పించేలా వ్యవసాయ ఆదాయ స్థిరీకరణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రధానమంత్రి ఫసల్ బీమాయోజనను అమ లు చేస్తున్నాయని జిల్లా వ్యవసాయ అధికారి బోసుబాబు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు ప్రకృతి వైపరీత్యాలతో పంట దిగుబడికి నష్టం వాటిల్లిన సందర్భంలో రైతుకు భరోసా కల్పిం చేలా వ్యవసాయ ఆదాయ స్థిరీకరణ, రైతులను ఆర్థికంగా ఆదుకునేందుకు ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకం ఉపయోగ పడుతుంద న్నారు.పథకం ద్వారా పూర్తి ప్రయోజనం పొందే విషయమై రైతులకు క్షేత్రస్థాయిలో విస్తృత అవగాహన కల్పించు కోవాలని దిగుబడి ఆధారిత పథకం అమలు విధివిధానాలు, ఎంపిక చేసిన పంటలు, బీమా యూనిట్లు, ప్రీమియం రేట్లు, బీమా మొత్తం, పరిహారాన్ని లెక్కించే విధానం తదితర అంశా లపై అవగాహన కల్పించు కోవాలన్నారు. రైతు సోదరులు తమ పంట పోలాలకు బీమా కట్టు కోవటానికి కామన్ మ్యాన్ సర్వీస్ సెంటర్‌లో రబీ క్రాప్ ఇన్సూరెన్స్ పోర్టల్ లాగిన్ ఓపెన్ అయిందన్నారు. రైతులు అందరూ కూడా తమ పంట పొలా లకు ఇన్సూరెన్స్ చేయించుకోవాల్సిందిగా కోరారు.ఈ క్రాప్ ఇన్స్యూరెన్స్ నమోదు కొరకు. ఆధార్ కార్డ్,పొలం పాస్ బుక్ జిరాక్స్ బ్యాంక్ అకౌంట్ జిరాక్స్ రైతు సేవ కేంద్రంలో సాగు సర్టిఫికెట్ రైతు ఫోన్ నెంబర్ పత్రాలతో దగ్గరలోని మీ సేవా కేంద్రాల్లో కాని సిఎస్‌సి సెంటర్‌లో గాని రైతులు వెళ్లి పంటల కు పథకానికి సంబంధించి పూర్తి వివరాలకు రైతు సేవా కేంద్రాలు, మండల వ్యవసాయ, ఉద్యాన సచివాలయ సిబ్బందిని సంప్రదించాలన్నారు.

శాశ్వత అన్నదానానికి దాతల విరాళాలు

ప్రజాశక్తి - యంత్రాంగం

జిల్లాలోని ప్రముఖ ఆలయాల్లో శాశ్వత అన్నదాన నిధికి పలువురు దాతలు శనివారం విరాళాలు అందజేశారు. వివరాలు ఇవి..

అయినవిల్లి: మండలంలో అయినవిల్లి విఘ్నేశ్వర స్వామి వారిని శనివారం రాజమహేంద్రవరానికి చెందిన కె.తిరుమల కష్ణారావు కుటుంబ సభ్యులు దర్శించికుని ప్రత్యేక పూజలు నిర్వహించారు అనంతరం విఘ్నేశ్వర స్వామి నిత్య అన్నదాన నిధికి రూ.10,116 విరాళంగా ఇచ్చినట్లు ఆలయ ఇఒ సతీష్ రాజు తెలిపారు. వీరికి ఆలయ అర్చకులు వేద ఆశీర్వచనం అందజేసి, శేష వస్త్రములతో సత్కరించి, స్వామి వారి చిత్రపటమును బహూకరించారు. **మామిడికుదురు**: అప్పనపల్లి శ్రీ బాల బాలాజీ దేవస్థానం శాశ్వత నిత్యాన్నదాన ట్రస్ట్ కు తాటిపాక వాసులు మట్టపర్తి వెంకటనారాయణ రూ.10,116 విరాళంగా సమర్పించారని ఆలయ సహాయ కమిషనర్ ఎం.సత్యనారాయణ రాజు శనివారం తెలిపారు. వారికి ఆలయ అర్చకులు ఆశీర్వచనం అందజేసి శేష వస్త్రములతో సత్కరించారు, ఆలయ సిబ్బంది స్వామివారి చిత్రపటం అందజేశారు.


అయినవిల్లిలో దాతలకు విఘ్నేశ్వరుని చిత్రపటం అందజేత